క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్న అగ్నిమాపక అధికారి సుధా

సాలూరు: స్థానిక పట్టణంలోని షుల్జీపేటలో అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. షార్ట్‌సర్క్యూట్, గ్యాస్ లీకేజీ కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాపాయం లేకుండా ఆస్తినష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సాలూరు: ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యువల్ కాలపరిమితి మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని స్థానిక పట్టణంలోని వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయిశ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని దాదాపు 4 వేలకు పైగా పాఠశాలలకు లబ్ధి చేకూరుతుందని, సీఎం జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 32 మంది ఎంపిక



నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి

బలిజిపేట: మండలంలోని వంతరాం గ్రామంలో శ్రీకాకుళం జిల్లా, రాగోలు జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో గ్రామంలోని సత్యసాయి సేవా సమితి, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 160 మంది రోగుల కళ్లను వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అయితే నేత్ర శస్త్రచికిత్సకు 32 మంది ఎంపికయ్యారని, వీరందరికీ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని సత్యసాయి సేవాసమితి జోనల్ కన్వీనర్ ఎ.పైడిరాజు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి వై.అప్పలకొండ, పీఆర్‌వో వెంకటేష్, వంతరాం సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

సీతానగరం: మండలంలోని పాఠశాలలు, ఉపాధ్యాయుల పనితీరు పరిశీలనకు రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో జి.సూరిదేముడు తెలిపారు. బుధవారం మండలంలోని జోగింపేట, అప్పయ్యపేట గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించామని, అక్కడి విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల బోధనా తీరు, పాఠశాలల రికార్డుల నిర్వహణను పరిశీలించామన్నారు. అలాగే విద్యార్థుల విద్యాప్రగతికి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోందన్నారు.

గాయత్రి అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రధాన రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రి మహాయజ్ఞం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని, గాయత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

గరుగుబిల్లి: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యంను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ జీవీ జనార్దన్ బుధవారం తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంను మిల్లులకు తరలించేందుకు 62 ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దళారీలు, మిల్లర్లు ప్రమేయంలేకుండా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఆర్‌బీకేల వద్ద ధాన్యం తేమశాతం పరిశీలించేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.



పార్వతీపురం టౌన్: కొత్తబెలగాం సచివాలయం-2 పరిధిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సాలూరు: తుండలో ప్రభుత్వ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మళ్లీ మళ్లీ జగనే సీఎం కావాలి

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంతో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని నేతలు ఇంటింటికీ వెళ్లి, వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాలు, సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటువేసి, తమ పార్టీని గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది.

– పార్వతీపురం, సాలూరు సాక్షి నెట్‌వర్క్.



సీతానగరం: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పెదభోగిలిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: లచ్చయ్యపేటలో సర్పంచ్ కృష్ణ ప్రచారం



బలిజిపేట: పెదపెంకిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్



సాలూరులో ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రైతు సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గుచ్చిమి గ్రామంలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయాలకు అనుబంధంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడమే కాకుండా రైతు పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. దీంతో రైతులకు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని తప్పిందన్నారు. గ్రామగ్రామాన ఉన్న ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం) సేవలతో అన్నదాతలంతా ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ మండల సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల బోర్డు, పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి, మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత మన పార్టీ శ్రేణులందరిపైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు అంబటి కృష్ణంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ పి.లక్షుంనాయుడు, ఎంపీడీవో బి.కృష్ణమహేష్ రెడ్డి, ఈవోపీఆర్‌డీ కె.కుమారవర్మ, పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్, ఏఈ చంద్రమౌళి, ఏవో ఎస్.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు

'మత్తు'తో జీవితం చిత్తు

• డీఎస్పీ మురళీధర్



పార్వతీపురంటౌన్: మత్తు పదార్థాలకు బానిసలైతే, జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, యువత, విద్యార్థులు గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. డార్క్ స్పాట్లు, పట్టణ శివారు ప్రాంతాల్లో నిఘా పెంచామన్నారు. ఆర్టీసీ, రైల్వే స్టేషన్లతో పాటు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని సిబ్బందికి సూచించారు. కళాశాల విద్యార్థులు చెడు అలవాట్ల బారినపడి మంచి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, ఏ ఒక్క విద్యార్థి చెడు వ్యసనాల బారినపడకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

స్థలం కేటాయింపు



రవాణా శాఖకు స్థలాన్ని అప్పగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గరుగుబిల్లి: ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మండలంలోని నాగూరులో మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పార్వతీపురం రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. నాగూరులో గతంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు భూమిని సేకరించారు. సేకరించిన భూమిలో కొంత స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలంలో సుమారు ఐదు ఎకరాలను రవాణాశాఖ అధికారులకు తహసీల్దార్ జీవీ జనార్దన్ బుధవారం అప్పగించారు.

పంపిణీకి పట్టాలు సిద్ధం

సాలూరు: స్థానిక పట్టణంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను తహసీల్దార్ బాలమురళీకృష్ణ బుధవారం కలిసి, పేదలకు భూ పట్టాల పంపిణీపై చర్చించారు. మండలంలోని ఐదు గ్రామాల్లోని 86 మంది లబ్ధిదారులకు 76.91 ఎకరాలకు సంబంధించి, పట్టాలను పంపిణీకి సిద్ధం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులందరికీ పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతీ పేదవాడి కళ్లల్లో ఆనందం చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ఆయన ఆ దిశగా పాలన కొనసాగిస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.



పట్టాల పంపిణీ వివరాలను డిప్యూటీ సీఎం రాజన్నదొరకు తెలియజేస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

• ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని మారుమూల గ్రామలైన కుమ్మరిగండి, గులుమూరు గ్రామాల్లో బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుమ్మరిగండికి రోడ్డు సదుపాయం కల్పించాలని.. అంగన్‌వాడీ భవనానికి బిల్లులు చెల్లించాలని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

అలాగే వనధన్ వికాస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి పీఓ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఓ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేపట్టాలి

• డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



రేషన్ పంపిణీ సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: సక్రమంగా రేషన్ పంపిణీ చేపట్టాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో సాలూరు, పాచిపెంట మండలాలకు చెందిన పలువురు రేషన్ లబ్ధిదారులు బుధవారం ఆయనను కలిసి, ఈ నెల తమకు రేషన్ అందలేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి, ఆరా తీశారు. ఈ నెల నుంచి రైస్‌కార్డులు అధికమవ్వడం, ఒకేవ్యక్తి రెండుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి ఉండడం, ఈ నెల 17వ తేదీ నాటికే గడువు పూర్తయి, లాగిన్ క్లోజ్ అయిపోవడం వంటి కారణాల రీత్యా నిర్ణీత సమయంలోగా రేషన్ పంపిణీ చేయలేకపోయామని అధికారులు సమాధానమిచ్చారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సాంకేతిక పరమైన సమస్యలు ఏవైనా తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించి, రేషన్ అందివ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదే విషయమై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కె.నాగేశ్వరరావుతో డిప్యూటీ సీఎం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా రైస్‌కార్డుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రేషన్ పంపిణీలో తలెత్తుతున్న ఇబ్బందులు వివరించారు. రేషన్ పంపిణీ గడువును ప్రతినెలా 20 లేదా 25వ తేదీ వరకు ఉంచాలని, సిగ్నల్స్ లేని గిరిజన గ్రామాల్లో ఆఫ్‌లైన్‌లో రేషన్ పంపిణీకి అనుమతి ఇవ్వాలని కోరారు.

ఎంఈవో అక్రమాలపై విచారణ చేపట్టాలి

సాలూరు: అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు పాచిపెంట ఎంఈవో తీరుపై విచారణ చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.జోగినాయుడు, పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు లావుడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 2018 నుంచి డీఏ రేటును 30.39 శాతానికి, జనవరి 2019 నుంచి 33.53 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సదరు డీఏ బకాయి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, సీఎఫ్ఎంఎస్‌కు పంపకుండా ఎంఈవో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఫలితంగా 2019 జూలై నుంచి 2021 డిసెంబరు మధ్య పదవీ విరమణ చెందిన 13 మంది ఉపాధ్యాయులు తమ డీఏ బకాయిలు అందుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. సదరు ఉపాధ్యాయులను పదేపదే ఎంఈవో తన చుట్టూ తిప్పుకుంటూ డీఏ బిల్లులు పెట్టడం లేదని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి జేవీకే(జగనన్న విద్యాకానుక) కిట్లు పాఠశాలలకు చేరవేసేందుకు ప్రభుత్వం జూన్ నెలలో రూ.83 వేలు మంజూరు చేసిందని, అలాగే ప్రతీ విద్యార్థికి రూ.11.20 చొప్పున ఇవ్వాల్సినవి కూడా ప్రధానోపాధ్యాయులకు నేటివరకు ఎంఈవో చెల్లించలేదని విమర్శించారు. మరికొన్ని విషయాల్లో కూడా ఎంఈవో అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాసామర్థ్యాల పరిశీలన



పెద్దింపేటలో విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో సింహాచలం

బలిజిపేట: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవోలు ఎస్.సింహాచలం, కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు సూచించారు. అజ్జాడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పెద్దింపేట, పి.చాకరాపల్లి, అజ్జాడ, గౌరీపురం, మురగడాం గ్రామ ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో సింహాచలం, నారన్నాయుడువలస స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గలావల్లి, కె.గలావల్లి, గేదెలపేట, నారన్నాయుడువలస, శ్రీరంగరాజపురం, గంగాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో కె.శ్రీనివాసరావు బుధవారం సందర్శించి, ఆయా పాఠశాలల పరిసరాలు, రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తోందని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఉత్తమ విద్యాబోధనను అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం పక్కగా మెనూ ప్రకారం పెట్టాలన్నారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలల వారీగా పర్యవేక్షణ చర్యలు చేపడుతున్నామని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఎంఈవో సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బయలుదేరిన క్రీడాకారులు

సీతంపేట: జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు బుధవారం విశాఖ బయలుదేరి వెళ్లారు. గురువారం నుంచి విశాఖలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారు. ఐటీడీఏ పరిధిలో సీతంపేట, మెళియాపుట్టి, మందస క్లస్టర్లకు చెందిన 26 మంది విద్యార్థులు స్టేట్ మీట్‌లో తలపడతారు. వీరికి ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, హెచ్‌ఎం టి. చంద్రరావు, ఎ.భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.



స్టేట్‌మీట్‌కు ఎంపికైన విద్యార్థులు

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు

• న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: పద్నాలుగేళ్ల లోపున్న చిన్నారులచే దుకాణాలు, గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి విజయ్ రాజజ్‌కుమార్ అన్నారు. పార్వతీపురం జిల్లా సహాయ లేబర్ అధికారులతో కలసి పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్‌వీ శ్రీనివాసరావు, లేబర్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, ప్యానెల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, కె.రవికుమార్, దిశ పోలీస్ సిబ్బంది లావణ్య, రవిబాబు, తదితరులున్నారు.



వ్యాపార సముదాల్లో యజమానులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు

పాలకొండ రూరల్: భగవాన్ సత్యసాయి 98వ జయంతి వేడుకలు పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక సాయి మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలకు డీఎస్పీ జీవీ.కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సును కోరి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం భక్తులు కోలాటం ప్రదర్శించారు.



సేవాసమితి సభ్యుల కోలాటం